సాక్షి ఒడిశా

సోమవారం । 17 । ఫిబ్రవరి । 2025



దివ్యాంగులను గౌరవించాలి

దివ్యాంగుల సంఘ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. హక్కుల గురించి వివరించారు.

- 8లో

తేనెటీగల దాడి

రాయగడ: స్థానిక ఆర్‌కే నగర్‌లో తేనెటీగలు దాడి చేయడంతో 8 మంది గాయపడ్డారు. శనివారం సాయంత్రం చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించి గాయపడినవారిలో ఆర్‌కే నగర్‌కు చెందిన ఆకాష్ పండ, అనంత పాడి, శ్యామఘన మాఝి, కె.సాయికిరణ్, బిజయ జొడియా తదితరులు ఉన్నారు. ఆర్‌కే నగర్ సమీపంలోని ఒక చెట్టుకు ఉన్న తేనెపట్టును అక్కడి ఆకతాయి కుర్రాళ్లు రాళ్లతో కొట్టారు. దీంతో చెల్లాచెదురైన తేనెటీగలు అటువైపుగా వెళ్లేవారిపై దాడి చేశాయి. గాయపడినవారిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వారి ఆరోగ్య పరిస్థితి మెరుగ్గా ఉండడంతో తిరిగి పంపించారు.

న్యూస్‌రీల్

దోపిడీకి విఫలయత్నం



నిందితుడు రాజేష్

జయపురం: ఒక యువకుడిని దోచుకునేందుకు దుండగులు చేసిన ప్రయత్నం విఫలం కాగా.. ఆ సంఘటనలో ఒకడిని పోలీసులు అరెస్టు చేసినట్లు జయపురం సదర్ పోలీసు అధికారి ఈశ్వర తండి ఆదివారం వెల్లడించారు. ఆయన వివరణ ప్రకారం ఈ నెల 14 వ తేదీ రాత్రి 7 గంటల సమయంలో జయపురం సమితి బంకబిజా గ్రామం రాజేంద్ర స్వయి జయపురంలో పనులు ముగించుకుని సైకిల్‌పై బంకబిజ గ్రామానికి వెళ్తుండగా బంకబిజ కూడలి వద్ద నలుగురు దుండగులు రాజేంద్రను అడ్డగించారు. రాజేంద్ర వద్ద గల డబ్బు ఇతర సామగ్రి ఇవ్వాలని బెదిరించారు. అంతలో గ్రామస్తులు అటుగా రావడంతో దుండగులు పారిపోయారు. అయితే వారిలో ఒకడు ప్రజలకు దొరికిపోయాడు. అతడిని సదర్ పోలీసులకు అప్పగించారు. నిందితుడు రమేష్ బెహర(54)ను పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

లాడ్జిలో యువకుడి మృతదేహం

రాయగడ: లాడ్జిలో ఒక యువకుడి మృతదేహాన్ని జిల్లాలోని టికిరి పోలీసులు శనివారం సాయంత్రం స్వాధీనం చేసుకున్నారు. మృతుడు తమిళనాడు రాష్ట్రంలోని తిరిచి ప్రాంతానికి చెందిన ఎస్.అబ్దుల్ హాసన్ (32)గా గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. శనివారం సాయంత్రం లాడ్జి గదిని శుభ్రపరిచేందుకు సిబ్బంది వెళ్లగా, లాడ్జి గదిలో ఉరికి వేలాడుతూ యువకుని మృతదేహం కనిపించింది. దీంతో మేనేజర్‌కు సమాచారం అందించగా వెంటనే టికిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. మృతుడు టికిరిలోని ఒక కర్మాగారంలో ఇంజినీర్‌గా పనిచేస్తున్నట్లు గుర్తించారు. అయితే ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలియజేశారు.

మారణాయుధాలు చూపి దోపిడీ



దుండగుల దోపిడీకి గురైన పీఈఓ అర్జున పాత్రో

జయపురం: మారణాయుధాలతో భయపెట్టి పంచాయతీ కార్యనిర్వాహక అధికారి(పీఈఓ) నుంచి దాదాపు రూ.8.6 లక్షలు దోచుకు పోయిన ఘటన ఆలస్యంగా తెలిసింది. ఈ సంఘటన జయపురం సబ్‌డివిజన్ బొరిగుమ్మ సమితి బిసింగపూర్ పోలీసు స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. బొడిగాం పంచాయతీ పీఈఓ అర్జున పాత్రో పంచాయతీ సమితిలో లబ్ధిదారులకు ప్రతి నెల బొరిగుమ్మ సమితి కార్యాలయం నుంచి డబ్బు తీసుకువచ్చి ఇచ్చేవారు. శనివారం మధ్యాహ్నం బైక్‌పై డబ్బు తీసుకుని బయల్దేరారు. మార్గంలో బిసింగపూర్ పోలీసు స్టేషన్ పరిధి రతాలీ–బొడిగాం రోడ్డులో ఆరుగురు అర్జున్‌పై దాడి చేసి అతడి వద్ద ఉన్న డబ్బును తీసుకెళ్లిపోయారు. సమాచారం అందిన వెంటనే బిసింగపూర్ పోలీసులు సంఘటనా ప్రాంతానికి వెళ్లి దర్యాప్తు ప్రారంభించారు. ఈ సమాచారం తెలిసిన వెంటనే బొడిగాం పంచాయతీ సర్పంచ్ కరుణ బొడొనాయిక్ స్థానిక ప్రజలతో అక్కడకు చేరుకున్నారు. బిసింగపూర్ పోలీసు అధికారి సూరజ్ ప్రధాన్ దర్యాప్తు ప్రారంభించారు.

దొంగతనం కేసులో ముగ్గురు అరెస్టు



నిందితుల సమక్షంలో కేసు వివరాలు వెల్లడిస్తున్న పోలీసు అధికారి

రాయగడ: దొంగతనం కేసులో ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో రాయగడ పిట్టవీధికి చెందిన భీముడు హుయిక, కిషోర్ మండంగి, రింటు కద్రకలు ఉన్నారు. వారి వద్ద నుంచి 1.74 లక్షల రుపాయల నగదుతో పాటు ఒక స్కూటీ, ఒక మోటార్‌సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించి సదరు పోలీస్ స్టేషన్ ఐఐసీ కే కే బికే కుహోరో ఆదివారం సాయంత్రం పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ నెల ఆరో తేదీన స్థానిక న్యూకాలనీకి చెందిన టి.గౌరిశంకర్ స్కూటర్ డిక్కీలో రూ. ఎనిమిది లక్షలు ఉంచగా.. గుర్తు తెలియని దుండగులు దొంగిలించారు. దీనిపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు ముగ్గురు నిందితులను గుర్తించి అరెస్టు చేశారు.

మార్చి 29న బార్ అసోసియేషన్ ఎన్నికలు



వేదికపై అసోసియేషన్ అధ్యక్ష కార్యర్శులు



సమావేశంలో పాల్గొన్న న్యాయవాదులు

జయపురం: కొరాపుట్ జిల్లా బార్ అసోషియేషన్ (జయపురం) కార్యవర్గ ఎన్నికలు 2025–26 ఏడాదికి సంబంధించి మార్చి 29న జరగనున్నాయి. ఇందుకు సంబంధించి సన్నాహక సమావేశం ఆదివారం మధ్యాహ్నం జిల్లా కోర్టు ఆవరణలోని అసోసియేషన్ కార్యాలయంలో జరిగింది. అధ్యక్షులు త్రినాథ్ సిగ్‌లాల్ అధ్యక్షతన జరిగిన కోఆర్డినేషన్ కమిటీ సమావేశంలో సీనియర్ న్యాయవాది దాసరథి పట్నాయక్‌కును ఎన్నికల అధికారిగా నియమించారు. ఎన్నికల నిర్వహణపై సభ్యులకు ఈయన శిక్షణ ఇస్తారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం మార్చి ఐదు నుంచి ఏడో తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. ఎనిమిదో తేదీన నామినేషన్‌లు వేసిన వారి జాబితా ప్రకటిస్తారు. తొమ్మిదో తేదీన నామినేషన్లను పరిశీలన జరుగుతుంది. స్క్రూటినీ తరువాత పదో తేదీన జాబితా ప్రకటిస్తారు. 12వ తేదీలోగా నామినేషన్లు ఉపసంహరించుకోవచ్చు. 13వ తేదీన ఎన్నికల బరిలో



ఎన్నికల అధికారి దాసరథి పట్నాయక్‌ను అభినందిస్తున్న త్రినాథ్ సింగ్‌లాల్ తదితరులు

ఉన్న అభ్యర్థుల జాబితా ప్రకటిస్తారు. 29వ తేదీ ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు. అదే రోజు సాయంత్రం నాలుగు ఓట్ల లెక్కిపు ప్రారంభించి విజేతలను ప్రకటిస్తారు. సన్నాహక సమావేశంలో ముఖ్యమైన విషయాలపై చర్చించారు. అలాగనే పలు తీర్మానాలు చేశారు. ముఖ్యంగా జయపురంలో ప్రముఖ న్యాయవాది, అసోషియేషన్ మాజీ అధ్యక్షులు, కొరాపుట్ జిల్లా కళలు, సంస్కృతిని ప్రపంచానికి చాటి చెప్పిన స్వర్గీయ సత్యనారాయణ అధికారికి పద్మశ్రీ అవార్డు ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ ప్రతిపాదన చేసింది. అలాగే జయపురంలో సర్క్యూట్ కోర్టును కనీసం నెలలో ఒక సారి నిర్వహించాలని జిల్లా కలెక్టర్‌ను సమావేశం కోరింది. జయపురంలో మరో ఏడీజే కోర్టు ఏర్పాటు చేయాలని, ఎన్‌డీపీఎస్ కేసుల విచారణ నిమిత్తం జయపురంలో ఒక ప్రత్యేక కోర్టు నెలకొల్పాలని, రాష్ట్ర కన్స్యూమర్ సర్క్యూట్ కోర్టు నెలకొల్పాలని సమావేశం విజ్ఞప్తి చేసింది. ఎన్నికల అధికారిగా నియమితులైన దాసరథి పట్నాయక్‌ను న్యాయవాదులు అభినందించారు. సమావేశంలో ఉపాధ్యక్షులు సత్యబ్రత పాఢీ, కార్యదర్శి మహేంద్ర అధికారి, సహాయ కార్యదర్శి పి.సన్యాసిరావు, ట్రెజరర్ సహదేవ్ పట్నాయక్, బాలా రాయ్‌సచిన్ కుమార్ పాఢీ, డి.శేఖగిరిరావు పాల్గొన్నారు.

ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు



విశేష అలంకరణలో లక్ష్మీనృసింహుడు



ఊరేగింపులో పాల్గొన్న భక్తులు



ఉత్సవమూర్తుల ఊరేగింపు



ఊరేగింపులో చిన్నారుల సందడి

రాయగడ: జిల్లాలో కొలనార సమితి అమలాభట్ట సమీపంలోని శ్రీక్షేత్ర టౌన్‌షిప్‌లో ఉన్న శ్రీలక్ష్మీనృసింహుని ఆలయ ప్రథమ వార్షికోత్సవంతో పాటు బ్రహ్మోత్సవాలు ఆదివారం నుంచి వైభవంగా ప్రారంభమయ్యాయి. దీనిలో భాగంగా జేకే పూర్‌లోని వేంకటేశ్వర స్వామివారి ఆలయం నుంచి శోభాయాత్ర జరిగింది. ఆధ్యాత్మికవేత్తలు, హరేరామ, హరేకృష్ణ దళాలు, సత్సంగ కార్యకర్తలు, పుర ప్రముఖులు పెద్ద సంఖ్యలో ఈ యాత్రలో పాల్గొన్నారు. అనంతరం ఉత్సవమూర్తులను మందిరం వద్దకు తీసుకెళ్లి నిలపడంతో బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఈనెల 21వ తేదీ వరకు ఉత్సవాలు కొనసాగుతాయి.

అధ్యక్ష పదవికి రేసులో 13 మంది

రాయగడ: జిల్లా బీజేపీ అధ్యక్ష పదవి ఎవరికి వరిస్తుందోనని సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఈ పదవికి ఇప్పటికే 13 మంది రేసులో ఉన్నారు. రాష్ట్రంలో ఆ పార్టీ అధికార పగ్గాలు చేపట్టడంతో ఈసారి అధ్యక్ష పదవి కోసం పైరవీలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో స్థానిక సిరిగుడలోని ఆ పార్టీ కార్యాలయంలో ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తున్న దేవేంద్ర మహంతిని శనివారం పలువురు కలిసి తమ నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. ఈ పదవికి రేసులో ఉన్నవారిలో కాశీరాం మాఝి, శివ శంకర్ ఉలక, రామచంద్ర బెహర, ఎం.గోపి ఆనంద్, హలధర్ మిశ్రో, పద్మనాబ్ దాస్ (టుటు దాస్), వై.గణపతిరావు, మంజుల మినియాక, శ్యామసుందర్ దాస్, గుణనిధి బాగ్, హలధర్ హిమిరిక, వై.కొండబాబు, భాస్కరపండలు ఉన్నారు. అయితే ఈసారి అధిష్టానం 40 నుంచి 60 ఏళ్లలోపు వయస్సు వారికి మాత్రమే ఈ పదవిని కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తోందని సమాచారం. అదే జరిగితే సీనియర్ నేతలకు అవకాశం ఉండకపోవచ్చు. రానున్న పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో సత్తాచాటేందుకు సరైన నాయకుడిని ఎంపిక చేసేందుకు అధిష్టానం ఆలోచన చేస్తోంది.

ముగిసిన ఎన్‌సీసీ పరీక్షలు



పరీక్ష రాస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్లు

రాయగడ: సీ సర్టిఫికెట్ కోర్సుల కోసం ఎన్‌సీసీ క్యాడెట్ల మధ్య నిర్వహించిన రాత పరీక్షలు ఆదివారంతో ప్రశాంతంగా ముగిశాయి. రాష్ట్రంలోని వివిధ కళాశాలలకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్లు పరీక్షకు హాజరయ్యారు. స్థానిక గోపబంధు మున్సిపాలిటీ ఉన్నత పాఠశాలలో ఆదివారం మహిళ బెటాలియన్–2 ఆధ్వర్యంలో జరిగిన పరీక్షలకు రాయగడ, కొరాపుట్, నవరంగపూర్, గజపతి జిల్లాల నుంచి 160 మంది క్యాడెట్లు హాజరయ్యారు.

పినాంకి కొండల్లో ఎలుగు సంచారం



పినాంకి సంరక్షిత అడవిలో ఎలుగుబంటి ఆచూకీ ప్రయత్నంలో అటవీ సిబ్బంది

జయపురం: జయపురం పట్టణం అటవీ విభాగం, పారాబెడల మధ్య గల పినాంకి కొండ రిజర్వ్ ఫారెస్టులో ఎలుగు సంచరిస్తోంది. దీంతో స్థానికులు భయపడుతున్నారు. సమాచారం అందిన అటవీ విభాగ అధికారులు అడవిలో గాలింపు చర్యలు చేపట్టారు. జయపురం అటవీ డివిజన్ అధికారి ప్రతాప్ కుమార్ బెహర, ఎస్ఎఫ్ఓ డాక్టర్ అమిత్ కుమార్ నాయిక్, రేంజర్ సచ్చితానంద పరిడ, ఫారెస్ట్ శశాంక మహరాణ, ఫారెస్టు గార్డ్ సతీష్ కుమార్ కాళో, వన్య జంతువుల పరిరక్షణ విభాగ టీమ్ లీడర్ కృష్ణ కేశవ షాడంగి అడవిలో గాలించారు. గత 12 వ తేదీన జయపురం పట్టణం మొకాపుట్ ప్రాంతంలో ఒక ఎలుగుబంటి తిరుగుతున్న ఫొటోలు సీసీ కెమెరాలో కనిపించాయి. 13 వ తేదీన పినాంకి పర్వత ప్రాంతంలో ఎలుగుబంటి సంచరించటం స్థానికుల కంట బడింది. ఆ విషయం తెలిసిన స్థానికులు వెంటనే అటవీ విభాగ అధికారులకు తెలియ జేశారు. దీంతో వారు గాలింపు మొదలుపెట్టారు.

ట్రాక్టర్–బైక్ ఢీకొని ఒకరు మృతి



సంఘటన స్థలంలో మృతదేహం

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి పోలీసుస్టేషన్ పరిధిలో ఉండ్రుకొండ పంచాయతీ రహదారిలో ఆదివారం మధ్యాహ్నం ట్రాక్టర్ బైక్ ఎదురెదురుగా ఢీకొని సుక కామ రామి (25) అనే వ్యక్తి మృతి చెందాడు. ఈయన పోడియ సమితి ఏరువన్‌పల్లి గ్రామ వాసి. తన భార్యతో కలిసి ఆదివారం ఉదయం అత్తవారింటికి వెళ్లారు. అక్కడ భార్యను వదిలి బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వస్తున్న సమయంలో ట్రాక్టర్ ఢీకొనడంతో తలకు గాయమై చనిపోయారు. ట్రాక్టర్ డ్రైవర్ పరారైపోయాడు. స్థానికులు కలిమెల పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఐఐసీ చంద్రకాంత్ తండ తన సిబ్బందితో వెళ్లి మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

అడవుల సంరక్షణ అందరి బాధ్యత



ప్రసంగిస్తున్న సరస్వతి మాఝి వేదికపై టున్ని తదితరులు



కార్యక్రమంలో పాల్గొన్న గ్రామస్తులు, విద్యార్థులు

రాయగడ: అడవులను సంరక్షించడం మనందరి బాధ్యత అని జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సరస్వతి మాఝి అన్నారు. స్థానిక రైతుల కాలనీలో గల ఫారెస్ట్ పార్క్‌లో జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన అడవుల సంరక్షణపై అవగాహన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కొంతమంది అవగాహన లోపంతో అడవులు తగుల బెడుతున్నారని అన్నారు. దీని వల్ల పర్యావరణానికి పెను ముప్పు సంభవిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. పచ్చని చెట్లతో ఉన్న అడవులను తగుల బెట్టడం వల్ల విలువైన ఔషధ వృక్షాలు నాశనం అవ్వడంతో పాటు పర్యావరణానికి పెను ముప్పు వాటిల్లుతుందని అన్నారు. ఏ ప్రాంతంలో అయినా అగ్ని ప్రమాదాలు సంభవిస్తే 112 కు డయల్ చేస్తే శకటాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న అటవీ రేంజర్ కామేశ్వర్ ఆచారి మాట్లాడుతూ ఇలాంటి తరహా అవగాహన కార్యక్రమాలు అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించి ప్రచారం కల్పిస్తున్నారని తెలిపారు. రాయగడ సమితి అధ్యక్షురాలు టున్ని హుయిక, పర్యావరణ వేత్త గౌరంగ చరణ్ , జిల్లా పరిషత్ సభ్యులు సంధ్యా పులక తదితరులు పాల్గొన్నారు.

ఆటలతో ఆరోగ్యం



విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ముఖ్యఅతిథి

జయపురం: ఆటలతో ఆరోగ్య సిద్ధిస్తుందని, విద్యార్థులు ఆటలకు ప్రాధాన్యత ఇవ్వాలని కొరాపుట్ జిల్లా విద్యాధికారి ప్రశాంత కుమార్ మహంతి అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన క్రీడా విజేతల బహుమతుల ప్రధాన ఉత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. చదువుతో పాటు ఆటలు కూడా ముఖ్యమేనని ఆయన అన్నారు. ప్రతి వారిలోనూ ప్రతిభ ఉంటుందని, దాన్ని బయటకు తీస్తే విజయం సొంతమవుతుందన్నారు. మొబైల్ చూస్తూ సమయం వ్యర్థం చేయకుండా సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గౌరవ అతిథిగా డైట్ ప్రిన్సిపాల్ రూప్‌చంధ్ సారేన్, బ్లాక్ అదనపు విద్యాధికారి ప్రియంబత పాత్రో, కోఆర్డినేటర్ చంద్ర కళా బగర్త, విజ్ఞాన విభాగ అధ్యాపకులు అనంత దళపతి పాల్గొన్నారు. టీచర్లు విశ్వరంజన్ గౌథ, ప్రభాతీ పాణిగ్రహి, హితకర చరిడి, దీపక సాహు, తనవీర్ మహమ్మద్, నిర్మల తండిక, సౌమ్యరంజన్ పట్నాయిక్, దేవేంద్ర పాడి, కె.ప్రమీల, శుభశ్మిత సాహు, రశ్మిత నాహక్, సాగరిక పాత్రో, బణిత శతపతి తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు అందుకున్న విద్యార్థులతో అతిథులు, పాఠశాల ఉపాధ్యాయులు

సవర బాప్టిస్టు క్రిస్టియన్ మండలి సభ రద్దు



సభకు తరలివచ్చిన క్రిస్టియన్లు

పర్లాకిమిడి: గజపతి జిల్లాలో అత్యంత ప్రాముఖ్యత సంతరించుకున్న సవర బాప్టిస్టు క్రిస్టియన్ మండలి సమ్మేళనం (సెరంగో) ప్లాటినాం జూబ్లీ వార్షిక వేడుకలు శనివారం ప్రారంభమయ్యాయి. సోమవారంతో ముగియాల్సి ఉండగా.. ఉన్నత స్థాయి పోలీసు అధికారుల ఆదేశాలతో ఆదివారం అర్ధాంతరంగా రద్దయ్యాయి. దీంతో గజపతి జిల్లా నుంచే కాక గుణుపురం, రాయగడ, ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చిన మైనార్టీ క్రిస్టియన్లు నిరాశతో వెనుదిరిగి వెళ్లిపోయారు. ప్లాటినాం జూబ్లీ ఎస్.బి.సి.ఎం.ఎస్. (సవర బాప్టిస్టు క్రిస్టియన్ మండలి) బల్లబోడా గ్రామం దంతరిలాల చర్చి వద్ద సభ ఈనెల 15 నుంచి 17వ తేదీ వరకూ మూడు రోజుల పాటు జరగాల్సి ఉంది. అయితే గజపతి జిల్లాలో ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీ, భజరంగ్ దళ్ వాటి అనుబంధ సంస్థలు దీనికి వ్యతిరేకంగా ఫిబ్రవరి ఐదో తేదీన నిరసన ర్యాలీని జరిపి కలెక్టర్ బిజయ కుమార్ దాస్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ ర్యాలీలో అనేక మంది సాధుసంతువులు, హిందూ సురక్షా మంచ్ తరఫున నిరసన వ్యక్తం చేశారు. సమ్మేళనానికి వ్యతిరేకంగా హిందూ సురక్షా మంచ్ నిరసనల మధ్య బాప్టిస్టు మండలి అధినేతలకు జిల్లా యంత్రాంగం అనేక ఆంక్షలు విధించారు. మహా సమ్మేళనానికి ఫైర్ క్లియరెన్సు, వేదిక సురక్షితమైనదని ఆర్అండ్‌బీ అధికారుల వద్ద నుంచి ఎన్ఓసీ, గోహత్యకు పాల్పడటం లేదని సర్టిఫికెటు, పోలీసు బందోబస్తు తదితర సర్టిఫికెట్లు మంజూరు చేయాలని జిల్లా మేజిస్ట్రేట్ ఒక లేఖ ద్వారా కోరారు. వీటిని ఎస్.బి.సి.ఎం.ఎస్ ప్రతినిధులు దాఖలు చేసి అనుమతి పొందారు. శనివారం ప్లాటినాం జూబ్లీ వేడుకలు ప్రారంభమైయ్యాయి. అయితే ఆదివారం బరంపురం డీజీ ఆదేశాల మేరకు 75వ ప్లాటినాం వేడుకలు రద్దు చేయాలని ఆదేశాలు రావడంతో అర్ధాంతరంగా ముగిశాయి.

రాణిపేటలో వాటర్ ప్లాంట్ ప్రారంభం



వాటర్‌ప్లాంట్‌ను పరిశీలిస్తున్న నారాయణరావు

పర్లాకిమిడి: కాశీనగర్ సమితి రాణిపేట మేజర్ పంచాయతీలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను మాజీ ఎమ్మెల్యే, బీజేపీ జిల్లా అధ్యక్షులు కోడూరు నారాయణరావు మినరల్ ప్రారంభించారు. కార్యక్రమంలో ప్లాంటు అధినేత కిరణ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు జి.శ్రీధర్ నాయుడు, వి.చిట్టిబాబు, లక్ష్మణ్, రఘురాం పాల్గొన్నారు.



ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

కెనాల్‌లో గుర్తు తెలియని యువకుని మృతదేహం



కెనాల్ నుంచి మృతదేహాన్ని బయటకు తీస్తున్న అగ్నిమాపక సిబ్బంది

జయపురం: అప్పర్ కొలాబ్ సాగునీటి ప్రాజెక్టు ధన్‌పూర్ శాఖా కెనాల్‌లో ఆదివారం ఉదయం 35 ఏళ్ల యువకుడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి జయపురం పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఏఎస్సై రాజేంద్రపంగి తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అగ్నిమాపక సిబ్బంది సహకారంతో మృతదేహాన్ని కెనాల్ నుంచి బయటకు తీశారు. శవం కుళ్లిపోయింది. చనిపోయి రెండు రోజులుపైనే ఉంటుందని పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. చనిపోయిన వ్యక్తి వివరాల కోసం పోలీసులు స్థానికంగా విచారణ చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. దీంతో కొరాపుట్ జిల్లా కేంద్ర ఆస్పత్రి జయపురం మార్చురీకి తరలించారు. మార్చురీలో 96 గంటలు మృతదేహాన్ని ఉంచుతామని.. ఇలోగా కుటుంబ సభ్యులు వస్తే అప్పగిస్తామని, లేకపోతే నిబంధనల ప్రకారం తరువాత చర్యలు తీసుకుంటామని జయపురం పట్టణ పోలీసు అధికారి రమణీ రంజన్ దొలైయ్ వెల్లడించారు. పట్టణ పోలీసు స్టేషన్‌లో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

క్లుప్తంగా

పాత పెన్షన్ అమలుచేయాలి

శ్రీకాకుళం న్యూకాలనీ: కేంద్ర ప్రభుత్వ మెమో నెంబర్ 57ను అమలు చేసి పాత పెన్షన్ అమలు చేయాలని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ ఏపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని చందనరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. డీఎస్సీ నోటిఫికేషన్ 2003 నవంబర్‌లో వెలువడితే.. ఉద్యోగాలను 2005 నవంబర్‌లో భర్తీచేసి రెండేళ్లపాటు జాప్యం చేసింది ప్రభుత్వమేనని గుర్తించాలన్నారు. న్యాయమైన డిమాండ్ పరిష్కారం కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో ప్రయత్నం చేయాలని, దీనివల్ల 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు మేలు చేకూరుతుందన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



మార్పు బాలకృష్ణమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

శ్రీకాకుళం న్యూకాలనీ: విద్యారంగ సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించాలని ఏఐఎఫ్ఈఏ చీఫ్ ప్యాట్రన్ కె.సుబ్బారెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు జి.హృదయరాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.చిరంజీవి డిమాండ్ చేశారు. శ్రీకాకుళం నగరంలోని క్రాంతిభవన్‌లో ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్(1938) జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం అధ్యయన తరగతులు నిర్వహించారు. ఏపీటీఎఫ్ కార్యకర్తలకు ఉపాధ్యాయ ఉద్యమం, సమకాలీన అంశాలు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ విధానాలు, నూతన విద్యా విధానం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర ఉద్యమ తొలి గురువు మార్పు బాలకృష్ణమ్మ చిత్రపటానికి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు చింతాడ దిలీప్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు బి.రవి, జిల్లా గౌరవ అధ్యక్షులు టెంక చలపతిరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఓల్డేజ్ హోమ్‌లో గుర్తు తెలియని బాలిక



ఓల్డేజ్ హోమ్‌లో ఉన్న బాలిక

బూర్జ: మండలంలోని పాలవలసలో సహాయమాత ఓల్డేజ్ హోమ్‌లో గుర్తు తెలియని బాలిక ఉందని, ఈమె వివరాలను గుర్తించి కుటుంబ సభ్యులకు తెలియజేయాలని నిర్వాహకులు ఆదివారం బూర్జ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నరసన్నపేటలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఈ అమ్మాయి గాయపడటంతో స్థానికులు కొందరు శ్రీకాకుళం ప్రభుత్వ రిమ్స్ ఆస్పత్రిలో చేర్పించారని, కాళ్లు విరగడంతో కొన్ని రోజులు అక్కడే ఉంచి చికిత్స అందించారని, ఆమె ఎవరో చెప్పలేని స్థితిలో ఉందని, కనీసం పేరు కూడా చెప్పడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. రిమ్స్ సిబ్బంది 2023 డిసెంబరు 31న ఓల్డేజ్ హోమ్‌లో చేర్పించారని, ఇంతవరకు బాలిక కోసం కుటుంబ సభ్యులు రాలేదని, వారి వివరాలు కనుక్కోవాలని కోరారు.

కారులో మంటలు

- కుటుంబానికి తప్పిన పెను ప్రమాదం

టెక్కలి: మండలంలోని నరసింగపల్లి సమీపంలో ఆదివారం ఓ కారు నుంచి హఠాత్తుగా మంటలు రావడంతో యజమాని గమనించి అప్రమత్తం కావడంతో పెను ప్రమాదం తప్పింది. టెక్కలి మండలం సీతాపురం గ్రామానికి చెందిన బెండి ఉదయ్ తన కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం కారులో పర్లాఖిమిడి వైపు వెళ్తుండగా, నరసింగపల్లి సమీపంలో రోడ్డుపై వేసిన మినుము మొక్కలు ఇంజిన్‌లోకి వెళ్లి రాపిడికి మంటలు వ్యాపించాయి. ముందుగా పొగలు రావడంతో గమనించిన ఉదయ్ ఒక్కసారిగా అప్రమత్తమై కారును నిలిపివేసి హుటాహుటినా కుటుంబ సభ్యులను సురక్షిత ప్రాంతానికి తరలించారు. అనంతరం గ్రామస్తుల సాయంతో మంటలపై నీరు చల్లడంతో ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో కారు ఇంజిన్, అడుగు భాగం దెబ్బతింది.

మద్యం బాటిళ్లు పట్టివేత

గార: ఉత్తరాంధ్రలో పేరున్న వత్సవలస రాజులమ్మ తల్లి యాత్రలో అనధికార మద్యం వ్యాపారం జోరందుకుంది. శని, ఆదివారాల్లో జరిగిన ఈ యాత్రకు అధిక సంఖ్యలో జనం తరలిరావడంతో అనధికార మద్యం వ్యాపారం జరగ్గా ఎక్సైజ్ పోలీసులు కేసులు నమోదు చేశారు. ఓ వ్యక్తి వద్ద నుంచి 10 బాటిళ్లు, మరొక వ్యక్తి నుంచి 15 బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామని సీఐ గోపాలకృష్ణ తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐలు ఆర్.మహేష్‌బాబు, బి.రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

రైలులో గుర్తు తెలియని వ్యక్తి మృతి

కాశీబుగ్గ: తిరుపతి-పూరీ రైలులో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు పలాస రైల్వే ఎస్ఐ ఎస్కే షరీఫ్ తెలిపారు. విశాఖపట్నం వద్ద రైలు ఎక్కిన 40 ఏళ్ల తప్పతాగి ఉన్నాడని, పలాస రైల్వే స్టేషన్ వచ్చేసరికి మృతి చెందినట్లు తోటి ప్రయాణికులు ఫిర్యాదు చేయడంతో మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. మృతుడి వివరాలు లభించలేదని, పలాస ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించామన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సర్వీస్ రూల్స్‌కు.. తిలోదకాలు



- బీసీ సంక్షేమశాఖ రూటే సెపరేటు
- నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు..ఆపై పదోన్నతులు
- ముడుపులు చెల్లిస్తే అక్రమాలన్నీ సక్రమాలే

శ్రీకాకుళం పాతబస్టాండ్: బీసీ సంక్షేమ శాఖలో సర్వీస్ రూల్స్‌కు తిలోదకాలిస్తున్నారు. ఉన్నతాధికారుల పేరు చెప్పి కొందరు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇతర ఏ ప్రభుత్వ శాఖలోనూ లేనివిధంగా ఇక్కడ పదోన్నతుల వ్యవహారం సాగుతోంది. అటెండర్ (ఆఫీస్ సబార్డినేట్)గా విధుల్లోకి చేరిన వారు, కుక్‌గా చేరిన వారు ఒక్క సారిగా మూడు కేడర్లు దాటి వసతి గృహ సంక్షేమాధికారిగా పదోన్నతులు పొందుతున్నారు. కేవలం డిగ్రీ అర్హత ఉంటే చాలు.. ఆ సర్టిఫికెట్ నకిలీదా వాస్తవమైనదా అన్నది పరిశీలించకుండానే పదోన్నతులు కట్టబెట్టేస్తున్నారు. నిబంధనలు తుంగలో తొక్కి ఉన్నతాధికారులకు డబ్బులు చెల్లించి ఉద్యోగాల్లో కొనసాగుతున్న వారు, అడ్డగోలుగా పదోన్నతులు పొందిన కొందరు ఉద్యోగులు విధులకు డుమ్మాకొట్టి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

- 2006లో జీఓ 36 ప్రకారం 10 శాతం ప్రమోషన్లు ఇవ్వాలని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జీవో జారిచేసింది. అప్పటికి అర్హత ఉన్నవారి ప్రకారం 8 మందికి పదోన్నతులు కల్పించాల్సింది. అయితే ఈ జీవోని తుంగలోకి తొక్కి అధికారులే సొంత జీవోను తయారు చేసుకొని కాసులకు కక్కుర్తి పడి ఏకంగా 25 మంది కింది స్థాయి ఉద్యోగులకు వార్డెన్లుగా (హెచ్‌డబ్ల్యూఓ) పదోన్నతులు కల్పించారు. ఈ ఖాళీలు ఎక్కడి నుంచి వచ్చాయో..ఏ జీవో ప్రకారం పదోన్నతుల కల్పించారో వారికే ఎరుక. ఇటువంటి పదోన్నతుల పర్యవసానంగానే గతంతో ఇక్కడ జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారిగా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన అధికారికి ఇప్పటికీ పెన్షన్ రాలేదు. అంతేకాకుండా ఆ కేసులు కూడా తేలలేదని కార్యాలయ సిబ్బందే చెబుతున్నారు. ఆ తర్వాత డీబీసీడబ్ల్యూఓగా వచ్చి అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న నాగరాణికి కూడా కేసుల బెడద తప్పలేదు.
- జీవో ప్రకారం పదోన్నతి పొందిన వారు మూడేళ్లలోపే బీఈడీ పూర్తి చేయాలి. అలా పూర్తి చేయకపోతే తిరిగి సబార్డినేట్ పోస్టుకి వెళ్లాలి. ఇక్కడ మాత్రం పదోన్నతి పొందడమే తప్ప ఆ తర్వాత పట్టించుకునే వారే కరువయ్యారు. ఒక వేళ ఎవరైనా డిగ్రీ సర్టిఫికెట్లు తెచ్చినా అవి నిజమైనవా నకిలీవా అన్న దర్యాప్తు కూడా చేపట్టడం లేదు.
- ఏ ఉద్యోగికైనా పదోన్నతి పొందాక రెండేళ్లలోపు డిపార్ట్‌మెంట్ టెస్టులు రాయాలి. అంటే ఎస్ఓ-1 ఉత్తీర్ణత సాధించాలి. లేదంటే పాత కేడర్‌కే రివర్ట్ చేయాల్సి ఉంది. ఆ నిబంధన కూడా ఈ శాఖలో ఇప్పటి వరకు అమలు కావడం లేదు. ఇటువంటి వాటిని ఆ ఉద్యోగులకు బూచిగా చూపించి కొందరు జిల్లా స్థాయి అధికారులు డబ్బులు దండుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బీసీ సంక్షేమశాఖలో డబ్బులిస్తే చాలు ఉన్నతాధికారులను, ఆపై ఉన్నతాధికారులను తప్పుతోవ పట్టించడంలో కొందరు ఘనాపాటిలు ఈ శాఖలో తిష్ట వేశారు.
- బీసీ సంక్షేమశాఖలో ముఖ్యంగా జోన్-1లో రూల్ 16 హెచ్ నడుస్తుంది. శ్రీకాకుళం జిల్లాలో 2008లో సీనియారిటీ లిస్ట్ ఇచ్చారని, మరలా ఇప్పటివరకు ఇవ్వకపోవడం దారుణమని వార్డెన్లు గగ్గోలు పెడుతున్నారు. ఇప్పుడు రూల్ 16హెచ్ పక్కను పెట్టి సీనియారిటీ పేరిట కొత్తగా అవినీతి పదోన్నతులు పేరిట ఫైల్‌ను తయారుచేసి మరోసారి కలెక్టర్, ఇతర అధికారులను తప్పుతోవ పెట్టించే ప్రయత్నం ఈ శాఖలో మొదలైందని ఆ శాఖ ఉద్యోగులు చెబుతున్నారు. తప్పుడు పదోన్నతులు ఇవ్వడం ఈ శాఖకు అలవాటుగా మారిందని ఆ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- సెటిల్డ్ సీనియారిటీ మార్చే అధికారం ఎవరికీ లేదు. 2008లో ఇచ్చిన సెటిల్డ్ సీనియార్టిని ఒక వేళ మార్పు చేయాలంటే మూడేళ్లలోపే మార్చే అధికారం ఉంటుంది. అప్పుడు చేయకుండా ఇప్పుడు మార్చే ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది.
- లావేరులో పనిచేసిన ఓ అటెండర్ నకిలీ డిగ్రీ సర్టిఫికెట్‌తో వార్డెన్‌గా పదోన్నతి పొందినట్లు ఆ శాఖ కార్యాలయ సిబ్బంది చెబుతున్నారు. ఆయనతో పాటు పదోన్నతి పొందిన ఇద్దరు ఉద్యోగ విరమణ పొందినా క్రమశిక్షణ చర్యలు క్రింద పెన్షన్ నిలుపుదల చేశారు. దీనిని బట్టి కొంత మందికి క్రమశిక్షణా చర్యలు, మరికొంతమందికి మినహాయింపులు ఉంటాయనేది అర్థం చేసుకోవచ్చు.
- ప్రధానంగా జిల్లా అధికారికి, కార్యాలయ సిబ్బందికి, అస్మదీయులకు అనుకూలంగా ఫైల్ తయారు చేస్తున్నట్లు సమాచారం. ఇదే జరిగితే నష్టపోయినవారు కోర్టుకు వెళ్లే అవకాశం ఉంది. ఇప్పటికే సమస్యలు, వివాదాలతో కూనరిల్లుతున్న ఈ సంక్షేమ శాఖ మరింత ప్రమాదంలో పడే పరిస్థితి ఏర్పడుతుంది. ముఖ్యంగా ఈ శాఖ జిల్లా కార్యాలయంలో అధిక శాతం మంది కారుణ్య నియామకం పొందినవారే. వారికి సర్వీస్ రూల్స్‌పై అవగాహన లేకపోవడం, అధిక వేతనంపై ఆశతో తప్పులమీద తప్పులు చేస్తున్నారని ఆ శాఖలో కొంతమంది ఉద్యోగులు బాహాటంగానే చెబుతున్నారు.

దివ్యాంగులను గౌరవించాలి



రాయగడ: దివ్యాంగులను మనమంతా గౌరవించాలని, అవసరమైతే వారికి అండగా నిలవాలని గంజాం జిల్లా దివ్యాంగుల మహాసంఘం అధ్యక్షుడు ఆనందరావు అన్నారు. సదరు సమితి హలువా తోటలో జిల్లా దివ్యాంగుల మహాసంఘం వార్షికోత్సవం ఆదివారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి ఎన్నో పథకాలు అమలు చేసిందని అన్నారు. అయితే అవగాహన లోపంతో కొంతమంది దివ్యాంగులు ఈ సదవకాశాలు వినియోగించుకోలేకపోతున్నారని తెలిపారు. హక్కులు, అధికారాల గురించి పోరాడాలని హితవు పలికారు. జిల్లా సామాజిక సంక్షేమ శాఖ అధికారి పుష్పలత దీక్షిత్, విద్యావేత్త డాక్టర్ డీకే మహంతి, జిల్లా పౌరసంబంధాల శాఖ అధికారి బసంత కుమార్ ప్రధాన్ తదితరులు పాల్గొన్నారు. జిల్లా దివ్యాంగుల మహాసంఘం అధ్యక్షులు శిశిర్ రాహుల్, కార్యదర్శి అమరేంద్ర నాథ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో దివ్యాంగులు పాల్గొన్నారు.

పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం

రాయగడ: పెళ్లి చేసుకుంటానని నమ్మించి విద్యార్థినిని మోసం చేసిన యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారు తెలిపిన వివరాల మేరకు.. బిసంకటక్‌లోని ఒక ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థినిని జిగిడి ప్రాంతానికి చెందిన ఉమాశంకర్ మాఝి అనే వ్యక్తి ప్రేమిస్తున్నానని చెప్పి వెంటపడేవాడు. దీంతో అతని మాయమాటలను నమ్మిన విద్యార్థిని సైతం ప్రేమించింది. ఈ క్రమంలో పెళ్లి చేసుకుంటానని చెప్పడంతో శారీరకంగా దగ్గరయ్యారు. అయితే కొద్ది రోజులుగా యువతి ఆరోగ్యం క్షీణించడంతో ఆశ్రమ పాఠశాల నిర్వాహకులు బిసంకటక్ ఆస్పత్రికి తరలించారు. విద్యార్థినిని పరిశీలించిన వైద్యులు ఆమె గర్భిణిగా నిర్ధారించారు. దీంతో పాఠశాల నిర్వాహకులు పోలీసుస్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు. పోలీసుల దర్యాప్తులో భాగంగా మోసపోయిన విద్యార్థిని వివరాలు చెప్పడంతో ఉమాశంకర్‌ను అరెస్టు చేశారు. దర్యాప్తులో సదరు యువకుడికి ఇదివరకే వివాహం అయినట్లు తేలింది.

దివ్యాంగ చిన్నారిపై కుక్కల దాడి



గాయపడిన శ్యామల

పొందూరు : పొందూరు పరిధిలోని అలబోయినపేట మంగళకాలనీ సమీపంలో కుక్కలు మూకుమ్మడిగా చేసిన దాడి చేయడంతో ఎనిమిదేళ్ల దివ్యాంగ చిన్నారి సెనగల శ్యామల తీవ్రంగా గాయపడింది. మూగ, చెవిటి సమస్యతో బాధపడుతున్న శ్యామల స్నేహితులతో కలిసి సమీపంలో పెళ్లి విందుకు వెళ్లి వస్తుండగా కుక్కలు దాడి చేశాయి. నాలుగు కుక్కలు వెనుక నుంచి ఒక్కసారిగా అరుస్తూ దూసుకొచ్చాయి. కుక్కల అరుపులకు పిల్లలంతా భయపడి పారిపోగా శ్యామలకు వినిపించకపోవడంతో అక్కడే ఉండిపోయింది. స్నేహితులు ఎందుకు పరుగుపెడుతున్నారో తెలుసుకునేలోగానే నాలుగు కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. కాళ్లు, చేతులు, పొట్టభాగంలో గాయాలయ్యాయి. ఇంతలో అటుగా వస్తున్న గ్రామస్తులు కుక్కలు తరిమి చిన్నారిని కాపాడారు. చిన్నారిని పొందూరు ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.

ఆదిత్యుని సన్నిధిలో మాఘమాస సందడి



ఆదిత్యుని సన్నిధిలో భక్తుల రద్దీ



సూర్యనమస్కార పూజలు చేయించుకుంటున్న భక్తులు



పుష్కరిణి ఒడ్డున పిడకల పొయ్యిలపై క్షీరాన్నం వండుతున్న మహిళలు

అరసవల్లి: ప్రత్యక్ష దైవం అరసవల్లి సూర్యనారాయణ స్వామి సన్నిధిలో మాఘమాస సందడి నెలకొంది. మాఘ మాసం రెండో ఆదివారం సందర్భంగా ఆలయ పరిసరాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. ఇతర జిల్లాల నుంచి సైతం భారీగా భక్తులు తరలివచ్చి ఆదిత్యునికి ప్రత్యేకంగా మొక్కులు చెల్లించుకున్నారు. ఇంద్రపుష్కరిణి వద్ద పిడకల పొయ్యిలపై క్షీరాన్నాన్ని వండి ఆదిత్యునికి నివేదించారు. తలనీలాల మొక్కులు తీర్చుకుని ఆరోగ్యం కోసం సూర్యనమస్కారాల పూజలు చేయించుకున్నారు. ఆలయంలో స్వామివారి మూలవిరాట్టును ప్రత్యేకంగా అలంకరించి వేకువజామున 6 గంటల నుంచే ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో సర్వదర్శనాలకు సిద్ధం చేశారు. భక్తులకు ఎండ వేడి నుంచి రక్షణగా ఆలయ ఈవో వై.భద్రాజీ ఆధ్వర్యంలో దర్శన మార్గాల్లో టెంట్లు వేయించారు.మంచినీటిని సరఫరా చేయించారు. మరుగుదొడ్ల విషయంలో మాత్రం భక్తులు అవస్థలు పడ్డారు. పలువురు అధికారులు ఆదిత్యున్ని దర్శించుకున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో దర్శనానికి రావడంతో వివిధ దర్శన టికెట్ల విక్రయాల ద్వారా రూ.8.15 లక్షలు, విరాళాలు, ప్రత్యేక పూజలు టికెట్ల విక్రయాల ద్వారా రూ.1,08,740, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ. 2.25 లక్షల వరకు ఆదాయం లభించినట్లు ఈవో ప్రకటించారు.

ఆటో బోల్తా..ఆరుగురికి గాయాలు



ప్రమాదానికి గురైన ఆటో

నరసన్నపేట: జాతీయ రహదారిపై దేవాది సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద ఆటో బోల్తా పడిన ఘటనలో ఆరుగురికి గాయాలయ్యాయి. అతివేగంతో వస్తున్న ఆటో పెట్రోల్ బంకు వద్దకు వచ్చే సరికి అదుపుతప్పడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. స్థానికులు స్పందించి క్షతగాత్రులను బయటకు తీశారు. ఆర్. ఈశ్వరమ్మ, కొండాలమ్మ, పైడమ్మలకు బలమైన గాయాలు కాగా, మిగిలిన ముగ్గురూ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఎచ్చెర్ల మండలం సనపలవానిపేటకు చెందిన వీరంతా ఆటోలో నిమ్మాడ వెళ్తుండగా ఈ ఘటన జరిగింది. గాయపడిన వారిని ఎన్‌హెచ్ అంబులెన్స్‌లో శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఎన్‌హెచ్ పెట్రోలింగ్ పోలీసులు సకాలంలో స్పందించి తగిన సహాయం అందించారు.

స్తంభాన్ని ఢీకొట్టిన ప్రైవేట్ బస్సు



విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న బస్సు ఇదే

శ్రీకాకుళం రూరల్: రాగోలు జంక్షన్ వద్ద ఆదివారం పాతపట్నం నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఓ ప్రైవేట్ బస్సు ఎదురుగా వస్తున్న స్కూటీని తప్పించబోయి ఎడమవైపు కరెంట్ స్తంభాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ప్రయాణికులకు ఎటువంటి గాయాలు కానప్పటికీ బస్సు ముందు భాగం నుజ్జునుజ్జయ్యింది. విషయం తెలుసుకున్న హైవే మొబైల్ పెట్రోలింగ్ సిబ్బంది ట్రాఫిక్‌ను చక్కదిద్దారు. ప్రయాణికులను వేరే బస్సులో పంపించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉత్తరాంధ్ర మాజీ సైనికుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ కలయికలో పాల్గొన్న సంఘ నాయకులు, మాజీ సైనికులు

శ్రీకాకుళం కల్చరల్: జిల్లా కేంద్రంలోని పెద్దరెల్లివీధిలో జిల్లా మాజీ సైనికుల ఫెడరేషన్ అధ్యక్షుడు కటకం పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో ఆదివారం ఉత్తరాంధ్ర జిల్లాల మాజీ సైనిక సంక్షేమ సంఘాల నాయకుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. వన్ స్టేట్ వన్ అసోసియేషన్ రాష్ట్ర అడహాక్ కమిటీ కన్వీనర్ కె.గోవిందరావు, రాష్ట్ర స్థాయి క్రియాశీలక నాయకులు, బాపట్ల జిల్లా మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు తాంద్ర సాంబశివరావు, రాజమండ్రికి చెందిన సీనియర్ మాజీ సైనికులు, న్యాయవాది డాక్టర్ సూరెడ్డి శివకుమార్ హాజరయ్యారు. మాజీ సైనికుల సంక్షేమానికి తమ వంతు కృషి చేస్తున్నామని, సంక్షేమ పథకాలు చేరేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కార్యక్రమంలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, పార్వతీపురం మన్యం జిల్లాల మాజీ సైనికుల సంక్షేమ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

నరసన్నపేటలో గంజాయి కలకలం

- 22 కేజీలు స్వాధీనం.. 9 మంది అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ జె.శ్రీనివాసరావు

నరసన్నపేట : నియోజకవర్గ కేంద్రం నరసన్నపేటలో గంజాయి వినియోగం ఒక్కసారి బట్టబయలైంది. ఒకేసారి 9 మంది అరెస్టు కావడంతో కలకలం రేగింది. స్థానికంగా గంజాయి అమ్మకాలు, వినియోగం జరుగుతుందని గమనించిన పోలీసులు దీనిపై నిఘా వేశారు. ఆర్టీసీ కాంప్లెక్స్‌తో పాటు పలు ప్రాంతాల్లో గంజాయి అక్రమంగా చేతులు మారుతున్నట్లు అనుమానంతో ఇటీవల సోదాలు చేశారు. అప్పట్లో ఏమీ లభించలేదు. శనివారం స్థానిక వెంకటేశ్వరాలయం ఎదురుగా రాజులు చెరువు గట్టుపై ఉన్న వీధిలో పసుపుల రమణ ఇంటి వద్ద కొందరు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. వీరి వద్ద రూ.66 వేల విలువైన 22 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిలో కొందరు గంజాయిని వినియోగిస్తున్నారు. వీరిని విచారించగా మిగిలిన వారూ పట్టుబడ్డారు. ఈ మేరకు కేసు నమోదు చేసి 9 మంది నిందితులను కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ జె.శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. స్థానిక ట్యాంకు బండ్ వీధికి చెందిన కోట ప్రదీప్, శ్రీరాంనగర్‌కు చెందిన లిమ్మా రాహుల్, పెద్దపేటకు చెందిన అరసవల్లి వరప్రసాద్, జగన్నాథపురానికి చెందిన దనిమిశెట్టి అజయ్, హనుమాన్‌నగర్‌కు చెందిన గొడ్డు రాఘవేంద్ర, బొంతల వీధికి చెందిన పొన్నాడ అజయ్, మేదర వీధికి చెందిన బెహరా హరి, శ్రీకాకుళం సానా వీధికి చెందిన తట్టా హేమంత్, పోలాకి గొల్లలవలసకు చెందిన దంత పునీత్‌లను అరెస్టు చేసినట్లు సీఐ వివరించారు. వీరి వద్ద రెండు ద్విచక్ర వాహనాలు, 9 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ట్రాక్టర్ ఢీకొని వైఎస్సార్ సీపీ నాయకుడు మృతి



రంగాల కృష్ణారెడ్డి (ఫైల్)

ఇచ్ఛాపురం రూరల్: బంధువుల వివాహ వేడుకకు హాజరై తిరిగి ఇంటికి వస్తుండగా ట్రాక్టర్ ఢీకొని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు మృతి చెందారు. అరకబద్ర గ్రామానికి చెందిన రంగాల కృష్ణారెడ్డి(63) ఆదివారం ధర్మపురం బంధువుల ఇంట్లో జరిగిన వివాహ వేడుకలకు హాజరయ్యారు. అక్కడి నుంచి మధ్యాహ్నం ఇంటికి తన ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తుండగా, ధర్మపురం-ఈదుపురం రోడ్డులో వెళ్తున్న ట్రాక్టర్ బలంగా ఢీ కొట్టింది. పంట పొలాల్లో పడి అక్కడికక్కడే మృతి చెందారు. ఈయనకు భార్య సీతమ్మ, కుమారుడు, కుమార్తెలు ఉన్నారు. రూరల్ ఎస్ఐ ఈ.శ్రీనివాస్ కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఇచ్ఛాపురం సామాజిక ఆసుపత్రికి తరలించారు. వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి అంకిత భావంతో పనిచేసిన కృష్ణారెడ్డి మృతి పట్ల జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు, ఎంపీపీ బోర పుష్ప, జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మ, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాంపల్లి చిట్టిబాబు, నాయకులు సంతాపం తెలియజేశారు.

ఆదాయానికి మద్యమే మార్గమంటూ..

- గ్రామాలకు డోర్ డెలివరీ చేస్తున్న టీడీపీ నాయకుడు
- కపాసుకుద్ది కేంద్రంగా బెల్టులకు మద్యం సరఫరా
- మత్స్యకార గ్రామాలకు అధికంగా మద్యం పంపిణీ



పాన్ షాపుల వద్ద బహిరంగంగా మద్యం తాగుతున్న మందుబాబులు

ఇచ్ఛాపురం రూరల్: కొత్త మద్యం పాలసీతో తెలుగు తమ్ముళ్ల జేబులు నింపుకుంటున్నారు. గ్రామాలకు అక్రమంగా మద్యం తరలిస్తూ రూ.లక్షలు గడిస్తున్నారు. కవిటి మండలం మత్స్యకార గ్రామానికి చెందిన ఓ టీడీపీ నాయకుడు ఇలా మద్యం సరఫరా చేసిన వైనం వెలుగు చూడడంతో అతను ప్రస్తుతం పరారైపోయాడు. ఈ నాయకుడు ప్రస్తుతం మత్స్యకార సొసైటీ అధ్యక్షుడిగా, రేషన్ షాపు డీలర్ ప్రతినిధిగా పరపతి సంపాదించాడు. తన వ్యాపారానికి కవిటి మండలం కపాసుకుద్ది కేంద్రంగా చేసుకుని ఇచ్ఛాపురం మండలం డొంకూరు నుంచి కపాసుకుద్ది, కర్రివారిపాలెం, ఇద్దివానిపాలెం, బెజ్జిపుట్టుగ, బొరివంక, కుసుంపురం, బల్లిపుట్టుగ వరకు బెల్టు షాపులను ఎంచుకొని ఇచ్ఛాపురం మండలం కొఠారీ వైన్ షాపుల వద్ద నుంచి రాత్రి సమయాల్లో సరుకును తీసుకొని పై గ్రామాలకు డోర్ డెలివరీ చేస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. బుధవారం ఇచ్ఛాపురం రూరల్ పోలీసులకు సుమారు రెండు లక్షల రూపాయల మద్యం దొరకడంతో.. సరుకును తీసుకువెళ్తున్న వ్యాను డ్రైవర్ ఈ 'బాబు' బండారాన్ని బయటపెట్టేశాడు. దీంతో రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ప్రస్తుతం ఈ నేత పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

గ్రామానికో రేటు..

గ్రామాల్లో బెల్టు షాపును నిర్వహించేందుకు గ్రామానికో రేటును ఫిక్స్ చేసినట్లు తెలుస్తోంది. మత్స్యకార గ్రామాల్లో రెండేసి బెల్టు షాపులు చొప్పున ఏర్పాటు చేసి ఒక్కో బెల్టు షాపు నుంచి గ్రామానికి రూ.30వేల నుంచి రూ.50 వేల వరకు ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌కు ఒక రేటు, ఎక్సైజ్ శాఖ స్టేషన్‌కు ఒక రేటును నెలవారీ మామూళ్లుగా ఫిక్స్ చేసినట్లు సమాచారం

పాన్ షాపులు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లే అడ్డా..

గత ప్రభుత్వంలో ఎక్కడా బెల్టు షాపుల ఊసే లేదు. ఒకవేళ అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులు, సెబ్ అధికారులు దాడులు చేసి నిర్వాహకులపై కేసులు నమోదు చేసేవారు. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక గ్రామాల్లోని పాన్‌షాపులు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లను ఏకంగా మినీ బార్‌లుగా మార్చేశారు. ఇక్కడ బెల్టు షాపులు నిర్వహిస్తూ రోజంతా మందుబాబులకు సరుకు అందిస్తున్నారు. బెల్టు షాపు నిర్వాహకులు క్వార్టర్ బాటిల్‌కు రూ.50 అదనంగా తీసుకుంటున్నారు. ఈ బెల్టుషాపులు అధికార పార్టీ నేతల కనుసన్నల్లో నిర్వహిస్తున్నారన్నది బహిరంగ రహస్యం.

నేటి నుంచి వాసుదేవుని బ్రహ్మోత్సవాలు



మందసలో పురాతన ఆలయం



పూజలందుకుంటున్న వాసుదేవ పెరుమాళ్

కాశీబుగ్గ: మందస పట్టణంలో కొలువైన వాసుదేవుని 16వ బ్రహ్మోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నెల 23 వరకు ఉత్సవాలు జరుగుతాయి. 14వ శతాబ్దానికి చెందిన ఈ ఆలయంలో రాజుల కాలం నుంచి ఏటా బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. 1744 సంవత్సరంలో నరసాపురానికి చెందిన తెలికిచెర్ల కందాడ రామానుజాచార్యస్వామి ఇక్కడ సంస్థానాచార్యులుగా ఉండేవారు. ఆయన వద్ద త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ పెద్ద జీయర్ స్వామి, గోపాలాచార్య స్వామి శిష్యులుగా ఉండేవారు. అప్పట్లో ఇక్కడ ఉన్న వేద పాఠశాలలో పండితులు విద్యనభ్యసించేవారు. 1950 వరకు ఆలయంలో క్రతువులు జరిగేవి. రాజుల పాలన అనంతరం కొన్ని దశాబ్దాల పాటు ఆలయం మూతపడి శిథిలావస్థకు చేరుకుంది. చిన్న జీయరుస్వామి వాసుదేవ ఆలయ చారిత్రక ప్రాముఖ్యతను గుర్తించి తన గురువు స్మారకార్థం జీర్ణోద్ధరణ చేసేందుకు సంకల్పించి 2001 నుంచి పునఃనిర్మాణ పనులను చేపట్టారు. 2009లో ఆలయాన్ని పునఃప్రతిష్ఠించారు. ఆలయంలో రాజుల పాలన కాలంలో ఉన్న విగ్రహాన్నే పునఃప్రతిష్ఠించారు. ఆలయంలో ఉన్న వాసుదేవ పెరుమాళ్ విగ్రహ నిజరూపం తిరుపతిలో ఉన్న వెంకటేశ్వరస్వామి విగ్రహం మాదిరిగానే ఉంటుంది.

బ్రహ్మోత్సవ కార్యక్రమ వివరాలు

- ఈ నెల 17వ తేదీ సోమవారం ఆంజనేయ స్వామి అభిషేకం.
- 18న శ్రీవాసుదేవ పెరుమాళ్ అభిషేకం, శ్రీవిశ్వక్సేన ఆరాధన, అంకురారోపణం.
- 19న గరుడపూజ, ధ్వజారోహణం, హనుమద్వాహనం, శేషవాహన సేవ.
- 20న కల్పవృక్ష వాహనము, ఎదుర్కోలు ఉత్సవం.
- 21న శ్రీ వాసుదేవ్ పెరుమాళు కల్యాణ మహోత్సవం, గరుడవాహన సేవ.
- 22న పొన్నచెట్టు వాహనము, తెప్పోత్సవం , అశ్వవాహనము
- 23న రథోత్సవ, చక్రస్నానం, ద్వాదశ రాధన, శ్రీపుష్పయాగం.

క్లుప్తంగా

బైక్ దొంగ అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై నారాయణరావు

గుర్ల: ద్విచక్ర వాహనం దొంగతనం కేసులో మండలానికి చెందిన సున్నపు ఉదయ్‌కుమార్‌ను పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. ఈ మేరకు ఎస్సై నారాయణరావు ఆదివారం తెలియజేసిన వివరాలు ఇలా ఉన్నాయి. బూర్లె పేటకు చెందిన బూర్లె పెంటం నాయుడు తన ఇంటి ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో శనివారం ద్విచక్ర వాహనాన్ని నిలిపివేశాడు. అక్కడకు రెండు గంటల తర్వాత వాహనం కనిపించకపోడంతో గ్రామ పరిసర ప్రాంతాల్లో వెతికారు. అయినా వాహనం కనిపించకపోవడంతో గుర్ల పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశాడు. దీంతో ఎస్సై నారాయణరావు సిబ్బందితో కలిసి వెంటనే నేర చరిత్ర ఉన్న మండలానికి చెందిన సున్నపు ఉదయ్ కుమార్‌ను అదుపులోకి తీసుకుని ప్రశ్నించడంతో బైక్ దొంగిలించినట్లు ఒప్పుకున్నాడు. దీంతో నిందితుడ్ని చీపురుపల్లి కోర్టులో ప్రవేశపెట్టగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారు.

ద్విచక్రవాహనం అపహరణపై కేసు నమోదు..

సంతకవిటి: మండల పరిధి పొనుగుటివలస గ్రామంలో ద్విచక్ర వాహనం దొంగతనంపై కేసు నమోదు చేశామని ఎస్సై ఆర్.గోపాలరావు ఆదివారం తెలిపారు. తన ఇంటి ముందు నిలిపి ఉంచిన ద్విచక్ర వాహనాన్ని ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకుపోయారని గ్రామానికి చెందిన రెడ్డి శ్రీనివాసరావు ఫిర్యాదు చేశాడన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

కుంకి ఏనుగులు ఎప్పుడొస్తాయి..?

పార్వతీపురం టౌన్: ఏనుగుల సమస్య పరిష్కరించేందుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చెప్పిన కుంకి ఏనుగులు ఎప్పుడొస్తాయని భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ పార్వతీపురం నియోజకవర్గం ఇన్‌చార్జ్ బత్తిన మోహనరావు ప్రశ్నించారు. ఆదివారం ఆయన పార్వతీపురంలో విలేకరులతో మాట్లాడుతూ.. ఏనుగుల భారిన పడి ఇప్పటివరకు 12 మంది మృతి చెందగా, సుమారు రూ. 6 కోట్ల మేర ఆస్తులు ధ్వంసం కావడం బాధాకరమన్నారు. కుంకి ఏనుగులు రప్పించి ఏనుగుల సమస్య పరిష్కరిస్తానన్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మాటలు ఏమయ్యాయన్నారు. 2017లో పార్వతీపురం మన్యం జిల్లాలో ప్రవేశించిన ఏనుగులు ఇప్పటివరకు 12 మందిని పొట్టను పెట్టుకోవడం విచారకరమన్నారు. అలాగే ఏనుగులు కూడా ఏడు మృతి చెందాయని చెప్పారు. ప్రభుత్వం తలుచుకుంటే ఏనుగుల సమస్య పెద్దదేమీ కాదని.. పాలకులు, అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయడం లేదని ఆరోపించారు. ఏనుగుల బారిన పడి మృతి చెందిన వ్యక్తుల కుటుంబాలకు రూ.20 లక్షల పరిహారం.. కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వంగల దాలినాయుడు, కోలా కిరణ్, శిరసపల్లి సాయి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు వచ్చిన రాష్ట్ర హైకోర్టు జడ్జి

- స్వాగతం పలికిన జిల్లా జడ్జి, కలెక్టర్



హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవికి పుష్పగుచ్ఛంతో స్వాగతం పలుకుతున్న జిల్లా జడ్జి, కలెక్టర్

విజయనగరం లీగల్: నగరంలో ఓ కార్యక్రమంలో పాల్గొనే నిమిత్తం స్థానిక జిల్లా పరిషత్ అతిథి గృహానికి రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా పోర్టుఫోలియో జడ్జి జస్టిస్ చీమలపాటి రవి ఆదివారం వచ్చారు. ఈ మేరకు ఆయనను మర్యాదపూర్వకంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయికల్యాణ్ చక్రవర్తి, కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌లు కలిసి సాదర స్వాగతం పలికారు. జిల్లా కోర్టుకు చెందిన పలువురు న్యాయాధికారులు కూడా హైకోర్టు న్యాయమూర్తిని కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి, కలెక్టర్, ఇతర న్యాయాధికారులతో జెడ్పీ అతిథి గృహంలో హైకోర్టు న్యాయమూర్తి కొద్దిసేపు ముచ్చటించారు.

పారా ఒలింపిక్స్ జాతీయస్థాయి పోటీలకు జిల్లా క్రీడాకారులు

విజయనగరం: ఈనెల 17 నుంచి 20 వరకు చెన్నైలో జరగబోయే 23వ పారా ఒలింపిక్స్ జాతీయస్థాయి చాంపియన్ షిప్ పోటీలకు ఆదివారం జిల్లా నుంచి బయల్దేరిన క్రీడాకారులకు పారా ఒలింపిక్స్ జిల్లా గౌరవ అధ్యక్షుడు కె.దయానంద్ ఆల్ ద బెస్ట్ తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 2న గుంటూరు జిల్లా మంగళగిరిలో జరిగిన పారా ఒలింపిక్స్ రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లాకు చెందిన సుంకరి దినేష్, దొగ్గా దేముడు నాయుడు, బోదల వాసంతి, కిల్లక లలిత పరుగు 100 మీటర్లు, 400 మీటర్లు, షాట్‌పుట్ అంశాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. జాతీయస్థాయి పోటీల్లోనూ రాణించి ప్రతి ఒక్కరూ పతకాలను సాధించి, తద్వారా జిల్లా ప్రతిష్ఠను మరింతగా పెంచాలని ఆకాంక్షించారు.

క్షయ కబళిస్తోంది..!

- టీబీ వంద రోజుల కార్యక్రమంలో అధిక సంఖ్యలో కేసుల గుర్తింపు
- రెండు నెలల్లో 401 కేసుల నిర్ధారణ
- గతేడాది డిసెంబర్ 7న జిల్లాలో 'టీబీ వంద రోజుల కార్యక్రమం' ప్రారంభం
- రెండు నెలల్లో 28, 800 మందికి క్షయ నిర్ధారణ పరీక్షలు



బొబ్బిలి మండలంలో క్షయ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది (ఫైల్)



జిల్లా క్షయ నివారణ కేంద్రంలో కఫం పరీక్ష చేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్

విజయనగరం ఫోర్ట్: జిల్లాలో క్షయ (టీబీ) వ్యాధి విస్తరిస్తోంది. క్షయ వ్యాప్తిని తెలుసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టుగా విజయనగరం జిల్లాలో టీబీ వంద రోజుల కార్యక్రమాన్ని చేపట్టింది. 2024 డిసెంబర్ 7వ తేదీన ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. క్షయవ్యాధిపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించడంతో పాటు గతంలో గుర్తించకుండా ఉండిపోయిన క్షయ కేసులను గుర్తించాలన్నది ఈ కార్యక్రమం ఉద్దేశం. టీబీ వంద రోజుల కార్యక్రమం చేపట్టిన ఈ రెండు నెలల కాలంలో వందల సంఖ్యలో కేసులను గుర్తించారు. చాలా మందికి క్షయ వ్యాధి పట్ల అవగాహన లేక పోవడమో.. అలసత్వమో తెలియదు కాని వ్యాధి లక్షణాలున్నా పట్టించుకోవడం లేదు. దీంతో వ్యాధి ముదిరి ఒకరి నుంచి మరొకరికి త్వరగా వ్యాప్తి చెందుతోంది. క్షయ వ్యాధిని త్వరగా గుర్తించగలిగితే వ్యాప్తిని నివారించవచ్చు.

28,800 మందికి పరీక్షలు..

టీబీ వంద రోజుల కార్యక్రమంలో ఇప్పటివరకు 4.38 లక్షల మందిని స్క్రీనింగ్ చేశారు. ఇందులో 28, 800 మందికి క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయగా, 401 మందికి వ్యాధి నిర్ధారణ జరిగింది. జిల్లాలో ప్రస్తుతం 1411 మంది క్షయవ్యాధికి చికిత్స తీసుకుంటున్నారు.

క్షయ వ్యాధి లక్షణాలు..

ఎడతెరిపి లేకుండా దగ్గు, జ్వరం రావడం.. ఆకలి మందగించడం.. వికారంగా ఉండడం, ఛాతిలో నొప్పి, బరువు తగ్గడం క్షయ వ్యాధి లక్షణాలు. మైక్రో బ్యాక్టీరియా క్యుబర్ క్యూలోసిస్ అనే బాక్టీరియా వల్ల క్షయ వ్యాప్తి చెందుతుంది. గాలి ద్వారా ఈ వ్యాధి ఇతరులకు వ్యాపిస్తుంది. క్షయ రోగి దగ్గినా, తుమ్మినా తుంపర్ల ద్వారా బ్యాక్టీరియా ఇతరులకు వ్యాపిస్తుంది.

పరీక్షలు చేసుకోవాలి..

రెండు వారాలకు మించి దగ్గు , జ్వరం, ఛాతిలో నొప్పి, బరువు తగ్గడం వంటి క్షయ వ్యాధి లక్షణాలు ఉంటే సమీపంలో ఉన్న కఫం పరీక్ష కేంద్రంలోకి వెళ్లి కఫం పరీక్ష చేసుకోవాలి. జిల్లాలో కఫం పరీక్ష కేంద్రాలు 34 ఉన్నాయి. అదేవిధంగా టీబీ యూనిట్లు 14 ఉన్నాయి. వీటిలో ఏ కేంద్రానికి వెళ్లినా ఉచితంగా పరీక్ష చేసి మందులు అందజేస్తారు.

క్షయ వ్యాధిలో రకాలు..

క్షయవ్యాధి వెంట్రుకలు, గోళ్లకు తప్ప శరీరంలోని ఏ అవయవానికైనా ఆశిస్తుంది. 35 నుంచి 50 ఏళ్ల వయసు గల వారికి వచ్చే అవకాశం ఎక్కువ. ఊపిరితిత్తులకు సంబంధించి పలమనరీ టీబీ ఎక్కువ మందికి ఆశిస్తుంది. అలాగే గర్భాశయం, చర్మ, ఎముకలకు, కళ్లకు వచ్చే క్షయ వ్యాధిని (ఎక్స్‌ట్రా పలమనరీ టీబీ) అంటారు. క్షయవ్యాధి ఎక్కువగా హెచ్ఐవీ వ్యాధిగ్రస్తులు, మధుమేహ వ్యాధిగ్రస్తులు, రక్తహీనత, పౌష్టికాహార లోపం ఉన్న వారికి వచ్చే అవకాశం ఉంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

క్షయవ్యాధి రాకుండా ఉండాలంటే చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి. ముఖ్యంగా ధూమపానం, మద్యపానం, సురక్షితం కాని లైంగిక సంబంధాలు వంటి వాటికి దూరంగా ఉండాలి. క్షయ వ్యాధి నిర్ధారణ అయితే వెంటనే మందులను పూర్తి కాలం పాటు వాడాలి. సాధారణ క్షయ వ్యాధికి ఆరు నెలల పాటు.. మధ్యలో మానివేసి తిరిగి ప్రారంభిస్తే 8 నెలలు.. మొండి క్షయ వ్యాధికి అయితే రెండేళ్ల పాటు మందులు వాడాలి. అలా కాకుండా మందులను మధ్యలో మానేస్తే రోగ నిరోధక శక్తి క్షీణించి మృత్యువాత పడే ప్రమాదం ఉంది.

అవగాహన కల్పిస్తున్నాం..

జిల్లాలో టీబీ వంద రోజుల కార్యక్రమాన్ని పైలెట్ ప్రాజెక్ట్ కింద చేపడుతున్నాం. గతేది డిసెంబర్ 7న ప్రొగ్రాం ప్రారంభించాం. జిల్లా వ్యాప్తంగా క్షయ వ్యాధిపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించడంతో పాటు క్షయ రోగులను గుర్తించి చికిత్స అందిస్తున్నాం. ఇప్పటివరకు 401 మంది రోగులను గుర్తించాం.

– డాక్టర్ కె. రాణి , జిల్లా క్షయ నివారణ అధికారి

మా జోలికి వస్తే చంపేస్తాం...

- విలేకరిని బెదిరించిన టీడీపీ మండల అధ్యక్షుడు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడు

మక్కువ: ఈ రోజు నుంచి నా జోలికి వచ్చినా.. మా నాయకులు, మినిస్టర్ గురించి రాసినా నీ ఇంటి కొచ్చి చంపేస్తామని టీడీపీ మండల అధ్యక్షుడు గుల్ల వేణుగోపాల్‌నాయుడు ప్రజాశక్తి విలేకరి మల్యాడ రామారావును బెదిరించారు. పైగా ఆదివారం ఉదయం మండలంలోని వెంగంపేట – కాశీపట్నం మధ్యలో రామారావుపై దాడి కూడా చేశారు. టీడీపీ మండలాధ్యక్షుడు బెదిరించిన వాయిస్ రికార్డు అన్ని సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేయడంతో సర్వత్రా చర్చనీయాంశమైంది. ఇదిలా ఉండగా టీడీపీ మండల అధ్యక్షుడు గుల్ల వేణుగోపాల్‌నాయుడు తనపై దాడి చేశారంటూ ప్రజాశక్తి విలేకరి రామారావు మక్కువ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై ఎస్సై వెంకటరమణ వద్ద ప్రస్తావించగా.. టీడీపీ మండలాధ్యక్షుడు వేణుగోపాల్‌నాయుడు నుంచి రక్షణ కల్పించాలని విలేకరి రామారావు ఫిర్యాదు చేసిన మాట వాస్తవమేనన్నారు. కోర్టు అనుమతితో కేసు నమోదు చేసే అవకాశం ఉన్నందున, ప్రస్తుతానికి ఫిర్యాదు స్వీకరించామని చెప్పారు.

దాడిని ఖండించిన జర్నలిస్టు సంఘాలు..

ప్రజాశక్తి విలేకరి మల్యాడ రామారావుపై టీడీపీ మక్కువ మండల అధ్యక్షుడు గుల్ల వేణుగోపాల్‌నాయుడు దాడి చేయడాన్ని జర్నలిస్టు సంఘాలు ఖండించాయి. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి పీఎస్ఎస్‌వీ ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు అల్లు సూరిబాబు, ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.రమేష్ నాయుడు, జాప్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అవనాపు సూరిబాబు, తెలుగు జర్నలిస్టు ఫోరం అధ్యక్షుడు ఎంఎంఎల్ నాయుడు, విజయనగరం వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు జి.కోటేశ్వరరావు, తదితరులు దాడిని ఖండించారు.

భౌతికదాడులు సరికాదు..

జర్నలిస్టులపై భౌతికదాడులు సరికాదు. విలేకరులు తప్పుడు వార్తలు రాస్తే, ప్రెస్‌మీట్‌లలో, పబ్లిక్ సమావేశాల్లో అడగడం మంచి పద్ధతి. అంతేగాని కక్షపూరితమైన చర్యలు చేపట్టడం మంచి సంస్కారం కాదు. అటువంటి వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలి. కొంతమంది కూటమి ముఖ్య నేతలు సైతం వారికి అనుకూలంగా వార్తలు రాయడం లేదన్న కారణంతో దాడులకు తెగబడుతున్నారు. ఈ సంస్కృతి సరైంది కాదు.

– పీడిక రాజన్నదొర, మాజీ డిప్యూటీ సీఎం

మంచి పద్ధతి కాదు..

విలేకరులు వారి వృత్తిరీత్యా వార్తలు రాస్తుంటారు. అందులో కొన్ని అనుకూలంగా ఉంటాయి.. మరికొన్ని ప్రతికూలంగా ఉంటాయి.. వాటిని రాజకీయ నాయకులు చూసి దిద్దుబాటు చర్యలు చేపట్టుకోవాలే తప్ప, వారిపై దాడులు చేయడం మంచి పద్ధతి కాదు. విలేకరిపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి.

– మావుడి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యుడు, మక్కువ

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

బొబ్బిలి రూరల్: మండలంలోని చింతాడ జెడ్పీ హైస్కూల్‌లో ఫిజిక్స్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న రాయల ఈశ్వరరావు రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. స్వగ్రామమైన అరసాడ నుంచి శనివారం ఉదయం బైక్‌పై బొబ్బిలి వస్తుండగా.. కారాడ వద్ద బైక్ అదుపు తప్పి పడిపోవడంతో తలకు గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు స్పందించి 108 వాహనంల ద్వారా బొబ్బిలి సీహెచ్‌సీకి తరలించగా.. ప్రాథమిక చికిత్స అనంతరం విజయనగరం మెడికవర్ ఆస్పత్రికి తరలించారు.

క్రీడాకారుల ఎంపిక రేపు

విజయనగరం: రాష్ట్ర స్థాయిలో త్వరలో జరగనున్న సీనియర్స్ టెన్నీకాయిట్ టోర్నమెంట్‌లో పాల్గొనబోయే జిల్లా స్త్రీ, పురుషుల జట్ల ఎంపికలను మంగళవారం చేపట్టనున్నట్లు జిల్లా టెన్నీకాయిట్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి సత్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పూసపాటిరేగ మండలం కొప్పెర్ల స్కూల్‌లో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి ఎంపిక పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఎంపిక పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఈనెల 21 నుంచి కాకినాడ వేదికగా జరగనున్న అంతర్ జిల్లాల పోటీలకు విజయనగరం జిల్లా జట్టు తరఫున పంపిస్తామన్నారు. మరిన్ని వివరాలకు ఫిజికల్ డైరెక్టర్ సత్యనారాయణను (94917 61126) సంప్రదించాలన్నారు.

కన్న కొడుకే కాలయముడు..



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాస్

- తండ్రిని హత్య చేసిన కొడుకు అరెస్ట్
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ

విజయనగరం క్రైమ్: విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధి గాజులరేగలో జరిగిన హత్య కేసు మిస్టరీని విజయనగరం టూటౌన్ పోలీసులు ఛేదించారు. ఈ మేరకు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విజయనగరం డీఎస్పీ శ్రీనివాస్, సీఐ శ్రీనివాస్‌తో కలిసి వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. ఈ నెల 12వ తేదీ రాత్రి తన భర్త సూరిబాబు మృతి చెందాడని అతని భార్య సృజన ఫిర్యాదు చేసిందన్నారు. వెంటనే ఎస్సై మురళి సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారని తెలిపారు. విచారణ నిమిత్తం భార్య, స్థానికులతో మాట్లాడగా మృతుడి కుమారుడిపై అనుమానం ఏర్పడిందన్నారు. వెంటనే అతడ్ని స్టేషన్‌కు తీసుకువచ్చి విచారించగా.. తండ్రిని హత్య చేసినట్లు ఒప్పుకున్నాడని తెలిపారు. ప్రస్తుతం ఉంటున్న ఇంటి విషయంలో తండ్రీ, కొడుకుల మధ్య తరచూ ఘర్షణలు జరుగుతుండేవన్నారు. తండ్రి అడ్డు తొలగిస్తే ఇల్లు తనకు దక్కుతుందని భావించి నిందితుడు (పోలీసులు పేరు వెల్లడించలేదు) ఈనెల 12న తండ్రితో గొడవపడి గుండెలపై పిడి గుద్దులు గుద్దడంతో పాటు కర్రతో బలంగా బాదడం వల్ల అక్కడికక్కడే మృతి చెందాడని చెప్పారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు.

తప్పని డోలీ మోతలు..



జన్ని రవిని డోలీలో తీసుకొస్తున్న యువకులు

శృంగవరపుకోట: మండలంలోని గిరిశిఖర గ్రామాల్లో ఉన్న తమకు డోలీ మోతలు తప్పడం లేదని.. ఓట్లు దండుకోవడానికి హామీలు ఇచ్చిన నాయకులు ఇప్పుడు మాట మరిచారని గిరిజన సంఘ నాయకులు ధ్వజమెత్తారు. మూలబొడ్డవర పంచాయతీ పరిధిలో గిరిశిఖర గ్రామమైన చిట్టంపాడుకు చెందిన జన్ని రవి అనే యువకుడు ఆదివారం కడుపునొప్పి, విషజ్వరంతో బాధపడడంతో బంధువులు ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేశారు. ఒక కర్రకు తట్టకట్టి రవిని అందులో కూర్చోబెట్టి, గ్రామానికి చెందిన యువకులు సుమారు ఏడు కిలోమీటర్లు కొండల మధ్యగా డోలీని మోసుకుంటూ మైదాన ప్రాంతానికి చేరుకున్నారు. అక్కడి నుంచి వాహనం దొరక్కపోవడంతో తెలిసిన వారి బైక్‌పై కూర్చోబెట్టి హుటాహుటిన ఎస్.కోట ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం రవి స్థానిక ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ సందర్భంగా ఏపీ గిరిజన సంఘ నేతలు, గ్రామ యువకులు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల వేళ ఎస్.కోట బహిరంగ సభలో మాట్లాడుతూ, చిట్టంపాడుకు చెందిన గంగులు భార్య, అతడి బిడ్డ వైద్యం అందక చనిపోయారని.. ఇది చాలా అవమానమని.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే అన్ని కష్టాలు తీరుస్తామని హామీ ఇచ్చారన్నారు. ఆయన చేసిన వ్యాఖ్యలను సోషల్ మీడియాలో పోస్టు చేశారు. కాని కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఎనిమిది నెలలు పూర్తవుతున్నా తమ కష్టాలు తీరలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిశిఖర గ్రామాలకు తక్షణమే రోడ్డు సౌకర్యం కల్పించకపోతే పోరాటం చేయకతప్పదని గిరిజన సంఘ నాయకులు జరతా గౌరీష్, తదితరులు స్పష్టం చేశారు.

ఆప్కాస్ రద్దు ఆలోచన మానుకోవాలి

- రౌండ్ టేబుల్ సమావేశంలో ఔట్ సోర్సింగ్ సిబ్బంది సంఘాల జేఏసీ డిమాండ్



నినాదాలు చేస్తున్న జేఏసీ ప్రతినిధులు

విజయనగరం అర్బన్: ఆప్కాస్ రద్దు చేయాలన్న మంత్రివర్గ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవడంతో పాటు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను కాంట్రాక్ట్ పద్ధతిలోకి మార్చాలని ఏపీ స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్, ఏపీ స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ టీచర్స్ అండ్ వర్కర్స్ జేఏసీ డిమాండ్ చేసింది. ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఈ మేరకు తీర్మానం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. మంత్రివర్గం నిర్ణయాల ప్రకారం ప్రభుత్వం ఔట్‌సోర్సింగ్ కార్పొరేషన్‌ను రద్దు చేసే ఆలోచనలో ఉందన్నారు. ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా కాకుండా రోస్టర్ పద్ధతి పాటించే కార్పొరేషన్ ద్వారా ప్రభుత్వమే నియామకాలు చేపట్టడం వల్ల వివిధ వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. స్థానిక సంస్థల్లో పని చేస్తున్న ఉద్యోగులు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు మినిమమ్ ఆఫ్ టైమ్ స్కేల్ వర్తింప చేయకూడదని ఇటీవల విడుదల చేసిన జీఓ 2ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఫెడరేషన్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్.బాలరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జేఏసీ రాష్ట్ర చైర్మన్ బి.కాంతారావు, డి.సాయిప్రసాద్, కె.సురేష్, కె.శ్రీనివాస్, రాజేష్, ఈశ్వరరావు, పి.దుర్గారావు, బి.శ్రీనివాసరావు, మజ్జి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

రైలు కింద పడి గుర్తు తెలియని మహిళ మృతి

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురం రైల్వే గేట్ సమీపంలో రైలు కింద పడి గుర్తు తెలియని మహిళ (30) మృతి చెందినట్లు విజయనగరం రైల్వే ఎస్సై బాలాజీరావు తెలిపారు. ఆయన తెలియజేసిన వివరాల ప్రకారం.. ఆదివారం ఉదయం 10 గంటల సమయంలో ఈ సంఘటన జరిగినట్లు భావిస్తున్నారు. మృతదేహం వద్ద ఎటువంటి ఆధారాలు లభించకపోవడంతో సర్వజన ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచారు. ఆచూకీ తెలిసినవారు 94906 17089. 83099 01038 నంబర్లను సంప్రదించాలని ఎస్సై తెలిపారు.

సమస్యలపై స్పందించరూ..!

- విజయనగరం రైల్వేస్టేషన్‌లో సమస్యల తిష్ట
- నేడు రైల్వే జీఎం పరమేశ్వరన్ పర్యటన



ఫుట్‌ఓవర్ బ్రిడ్జ్ నిర్మించాల్సిన ప్రదేశమిదే...

విజయనగరం టౌన్: రైలు ప్రయాణికుల అభ్యున్నతికి పాటు పడుతున్నామని చెబుతున్న రైల్వే అధికారులు జిల్లాకు సంబంధించి చేయాల్సిన అభివృద్ధి పనుల విషయంలో వెనుకంజ వేస్తూనే ఉన్నారు. ఏళ్ల తరబడి ముఖ్యమైన పనులు పెండింగ్‌లో ఉన్నప్పటికీ వాటి గురించి ఆలోచించే నాథుడే కరువయ్యాడు. ఈస్ట్‌కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వరన్ (భువనేశ్వర్) వార్షిక పర్యటనలో భాగంగా అభివృద్ధి చెందిన అమృత్‌భారత్‌లో ఎంపికైన రైల్వే స్టేషన్‌గా పేరొందిన విజయనగరం జంక్షన్‌ను సోమవారం సందర్శించనున్నారు. రైల్వే జీఎం రానున్న నేపథ్యంలో రైల్వే స్టేషన్‌ను సిబ్బంది సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. రైలు ప్రయాణికుల శ్రేయస్సే తమ లక్ష్యమంటూ రైల్వేశాఖ చెప్పుకుంటూ వస్తున్నప్పటికీ ప్రయాణికుల సమస్యలు తీర్చడంలో మాత్రం ఎప్పటికప్పుడు విఫలమవుతూనే ఉంది. నిత్యం వేలాది మంది ప్రయాణికులు ఈ స్టేషన్ ద్వారా తమ కార్యకలాపాలు కొనసాగిస్తుంటారు. రోజుకు సాధారణ టికెట్ల ద్వారా రూ. 3.5 లక్షలు, రిజర్వేషన్‌ల ద్వారా రూ.3 లక్షలు, పార్సిళ్ల ద్వారా రూ. 25 వేల పైబడి ఆదాయం సమకూరుతోంది. మామిడి ఎగుమతుల ద్వారా ఏడాదికి సుమారు రూ.10 కోట్లకు పైగా ఆదాయం వస్తోంది. ఉద్యోగ, వ్యాపార వాణిజ్య కేంద్రంగా ఉన్న విజయనగరం నుంచే అత్యధిక సంఖ్యలో ప్రయాణికులు ప్రయాణాలు చేస్తుంటారు. అయితే ప్రయాణికులకు కావాల్సిన కనీస మౌలిక సదుపాయాలు కల్పించలేకపోతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తున్నాయి.

సమస్యల సుడిలో..

- జిల్లా కేంద్రంలో ఐదో నంబర్ ప్లాట్‌ఫారం నుంచి తొమ్మిదో నెంబర్ ప్లాట్‌ఫారం వరకు గతంలో కంటోన్మెంట్ వైపు ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభించారు. అందుకు సంబంధించిన అలైన్‌మెంట్‌లు వేశారు. ఏళ్లు గడిచిపోతున్నాయి కాని పనులు మాత్రం జోరందుకోలేదు. పనుల్లో భాగంగా పాత బ్రిడ్జి కూల్చేశారు. దాని స్థానంలో కొత్త బ్రిడ్జి పనులు ప్రారంభించారు. కానీ అవి ఎక్కడివేసిన గొంగలి అక్కడే అన్నచందంగా తయారయ్యాయి. నామినేటెడ్ ప్లాట్‌ఫారం పైకి రైళ్లు వచ్చేలా అధికారులు చర్యలు చేపట్టాలి.
- కంటోన్మెంట్ గూడ్స్‌షెడ్ నిరుపయోగంగా పడి ఉంది. నిర్మానుష్యంగా ఉండడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. ఇప్పటికే పలు మార్లు గంజాయి విక్రయిస్తున్న వారిని, సేవిస్తున్న వారిని పోలీసులు పట్టుకున్న దాఖలాలున్నాయి.
- రైల్వేస్టేషన్‌లో ఐదు ప్లాట్‌ఫారమ్స్ ఉన్నప్పటికీ కేవలం ఒకటో నంబర్ ప్లాట్‌ఫారంపైనే సులాభ్ కాంప్లెక్స్ ఉంది. ప్రయాణికులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది.
- వాస్తవానికి ఒకటో నెంబరు ప్లాట్‌ఫారంపై ప్రయాణికులకు సంబంధించిన రైళ్లు ఆగాల్సి ఉంది. కానీ వాటిని మూడు, నాలుగు ప్లాట్‌ఫారాలకు డైవర్షన్ చేస్తున్నారని ఆరోపణలున్నాయి. ఒకటో నంబర్ ప్లాట్‌ఫారంపై గత కొన్నేళ్లుగా గూడ్స్‌రైళ్లు నిలుపుదల చేస్తుండడంతో వయోవృద్ధులు, దివ్యాంగులు పక్క ప్లాట్‌ఫారాలకు వెళ్లడానికి నరకయాతన అనుభవిస్తున్నారు.
- వీటీ అగ్రహారం వద్ద ఉన్న మ్యాంగో యార్డ్ నిరుపయోగంగా ఉంది.
- ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ పోలీస్ స్టేషన్ భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. వర్షం వచ్చినప్పుడు రికార్డులన్నీ తడిచి ముద్దవుతున్నాయి.
- కోరమండల్ ఎక్స్‌ప్రెస్, హౌరా -కన్యాకుమారి ఎక్స్‌ప్రెస్‌లు బాగా డిమాండ్ ఉన్న రైళ్లు. వీటికి విజయనగరంలో స్టాప్ లేదు. దీనిపై దృష్టిసారించాలి.
- చీపురుపల్లి రైల్వేస్టేషన్‌లో కోణార్క్ , ఫలక్‌నుమా వంటి సూపర్ ఫాస్ట్ రైళ్లకు నిలుపుదల లేదు. దీనివల్ల అక్కడ నుంచి ప్రయాణికులు విజయనగరం, విశాఖ వెళ్లి తమకు కావాల్సిన రైళ్లను ఎక్కాల్సిన పరిస్థితి నెలకొంది.
- గజపతినగరం రైల్వేస్టేషన్ నుంచి బొండపల్లి, మెంటాడ, దత్తిరాజేరు, తదితర ప్రాంతాలకు చెందిన వారు ఎక్కువగా ప్రయాణాలు చేస్తుంటారు. ఇక్కడ కొన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్ లేకపోవడంతో బొబ్బిలి, విజయనగరంలలో దిగి స్వగ్రామాలకు వెళ్లాల్సి వస్తోంది.
- ఆదర్శ రైల్వేస్టేషన్‌లుగా గుర్తింపబడినప్పటికీ బొబ్బిలి, పార్వతీపురం రైల్వేస్టేషన్‌లు అభివృద్ధికి నోచుకోకపోవడం విచారకరం. సీతానగరం రైల్వేస్టేషన్‌దీ అదే పరిస్థితి.



విజయనగరం రైల్వేస్టేషన్

విద్యార్థులు ఇష్టంతో చదవాలి

పార్వతీపురం: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పదవ తరగతి విద్యార్థులు ఇష్టంతో చదవాలని, కష్టంతో కాదని, ఆ దిశగా విద్యార్థులను తీర్చిదిద్దాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. ప్రతి ఏడాదిలాగానే ఈ ఏడాది కూడా పదో తరగతి ఉత్తీర్ణత శాతంలో రాష్ట్రస్థాయిలో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని ప్రధాన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులను కోరారు. మై స్కూల్-మై ప్రైడ్‌పై హెచ్‌ఎం, టీచర్స్‌తో కలెక్టర్ ఆదివారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. పాఠ్యాంశాలపై ప్రతి విద్యార్థి సంపూర్ణ విజ్ఞానం కలిగి ఉండాలని, ఆ విధంగా చేయడమే మై స్కూల్-మై ప్రైడ్ ఉద్దేశ్యమని పేర్కొన్నారు. పదవ తరగతి చదివే విద్యార్థుల ఉత్తీర్ణతా శాతం పెంచడం కోసం దీన్ని రూపొందించినట్లు చెప్పారు. పదవ తరగతికే పరిమితం కాకుండా మై స్కూల్-మై ప్రైడ్ ప్లస్ గా రూపొందించి అన్ని తరగతుల విద్యార్థులకు పాఠ్యాంశాలలో సంపూర్ణ విజ్ఞానం కలిగేలా తీర్చిదిద్దడం, ఆటలు, వ్యాసరచన, చర్చలు, సైన్స్ ఫెయిర్స్‌లో విద్యార్థులు పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. సబ్జెక్టుల వారీగా ఎక్కడా టీచర్స్ కొరత లేకుండా సర్దుబాటు చేశామని, విద్యార్థులకు బోధన విషయంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు.వెనుకబడిన విద్యార్థులను గుర్తించి, ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. తొలుత పాఠ్యంశాలపై విద్యార్థులకు ప్రశ్నలు వేసి సమాధానాలు అడిగి తెలుసుకోవాలని, పదవ తరగతి చదువు అనంతరం ఉపాధి అవకాశాలు లభించే కోర్సులపై అవగాహన కల్పించాలని కోరారు. సమావేశంలో ఉప, మండల విద్యాశాఖాధికారులు, పాఠశాలల ప్రధాన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.